## బస్సుల సంఖ్యను పెంచాలి

ధన్వాడ, డిసెంబర్ 14 : కాంగ్రెస్ ప్రభుత్వం ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడంతో మగవారికి బస్సులో ప్రయాణించడం కష్టంగా మారిందని, ప్రభుత్వం బస్సుల సంఖ్యను పెంచాలని మండల బీఆర్ఎస్ ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. సరిపడా బస్సులు లేక పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని డిమాండ్ చేశారు.

## భవన నిర్మాణ కార్మికులకు శిక్షణ

పెబ్బేరు, డిసెంబర్ 14 : మండలంలోని గుమ్మడం గ్రామంలో భవన నిర్మాణ కార్మికులకు పదిహేను రోజులపాటు శిక్షణ ఇచ్చే కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో కార్మికశాఖ సహకారంతో ఉచితంగా వృత్తి నైపుణ్య శిక్షణను ఇస్తున్నారు. శిక్షణలో 30 మంది కార్మికులు పాల్గొంటున్నట్లు వారు తెలిపారు.

## అయ్యప్పస్వాముల ఇరుముడి

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 14 : మండల కేంద్రంలో అయ్యప్ప స్వాముల ఇరుముడి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు , భజనలు చేసి ఇరుముడి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు, అయ్యప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రప్రభుత్వం మొండివైఖరి వీడాలి

- తపాలా ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు


ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ ఢాక్ సేవకులు

వనపర్తి టౌన్, డిసెంబర్ 14 : కేంద్రప్రభుత్వం తపాలా ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న మొండివైఖరి వీడాలని తపాలా ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్ ఎదుట ఢాక్ సేవలు ధర్నా నిర్వహించి ఆయా వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ విష్ణువర్ధన్‌గౌడ్, కన్వీనర్ రవీందర్‌లు మాట్లాడుతూ 8గంటల పని పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలని, ఇంక్రిమెంట్స్, ఉద్యోగులకు ఇచ్చిన మాదిరిగా వెయిటేజీ, సీనియర్ బంచింగ్ ఇవ్వాలని తదితర డిమాండ్లను నెరవేర్చాలన్నారు. అంతకు ముందు ఇతర పార్టీల నాయకులు మద్దతు తెలిపారు.

## రూ.12,230 ధర పలికిన కందులు

నారాయణపేట, డిసెంబర్ 14 : పేట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో గురువారం 314 క్వింటాళ్ల తెల్లకందులు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.12,230, కనిష్ఠంగా రూ.10,300 ధర పలికాయి. అదేవిధంగా 63 క్వింటాళ్ల హంసరకం ధాన్యం విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.3,275, కనిష్ఠంగా రూ.1,876 ధర పలికింది. 1,222 క్వింటాళ్ల సోనాధాన్యం విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.3,433, కనిష్ఠంగా 2,009 ధర పలికింది. 1,160 క్వింటాళ్ల ఎర్రకందులు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.11,220, కనిష్ఠంగా రూ.8,188 ధర పలికినట్లు యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

## విద్యాబోధనపై శిక్షణా తరగతులు

గోపాల్‌పేట, డిసెంబర్ 14 : రాష్ట్రంలోనే మొదటి సారిగా మాతృసంస్థ నెదర్లాండ్స్ మాంటిస్సోరి విద్యావిధానం మండల కేంద్రంలోని తొలకరి చినుకులు పాఠశాలలో ఉచితంగా శిక్షణా తరగతులు ఈనెల 18 నుంచి 30 వరకు నిర్వహిస్తామని నిర్వాహకురాలు పరిమళ గురువారం ప్రకటనలో తెలిపారు. మరింత సమాచారం కోసం 8309671273, 9666534241 నెంబర్లను సంప్రదించాలని ఆమె కోరారు.

## ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

పెబ్బేరు, డిసెంబర్ 14 : మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మునగమాన్‌దిన్నెలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్ఐ జగదీశ్వర్ మాట్లాడుతూ కేశపాగ బాలకృష్ణ (42) నిత్యం మద్యానికి బానిస కావడంతో.. అతని భార్య గత రెండేండ్లుగా కాపురానికి రావడం లేదు. తన ముగ్గురు పిల్లలు, తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్న క్రమంలో జీవితంపై విరక్తి చెంది గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

# లంచం అడిగితే నేరుగా ఫిర్యాదు చేయండి

- జిల్లా ప్రజలకు కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచన


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కోయశ్రీహర్ష

మక్తల్‌టౌన్, డిసెంబర్ 14 : ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా అధికారులు లంచాలు అడిగితే నేరుగా తన కార్యాలయంలో వచ్చి ఫిర్యాదు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలో ప్రభుత్వ కార్యాలయంలో పనిచేసే అధికారులు ఉద్యోగులు సిబ్బంది ఎవరైనా పనులు చేయడానికి లంచాలు అడిగితే ఇవ్వొద్దని, ప్రజలకు పనిచేసేందుకే ప్రభుత్వ అధికారులు ఉన్నారని. కార్యాలయాల్లో ఎవరికీ నయా పైసా కూడా ఇవ్వరాదని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఎవరూ అధికారులు అవినీతికి తావివ్వొద్దని, ప్రజలు పారదర్శకమైన సేవలను పొందాలని పేర్కొన్నారు. ఇటీవల పేట మున్సిపల్ కార్యాలయం తాసీల్దార్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో లేఅవుట్, అప్రూవల్ కోసం వెళ్లిన వారి నుంచి అధికారులు లంచాలు అడిగినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఒకవేళ డబ్బులు తీసుకున్నట్లు తెలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. ప్రజలు నిర్భయంగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి అధికారులు ఉద్యోగులతో తమ పనులు చేసుకోవాలని సూచించారు.

# ధ్యానంతోనే ఆరోగ్యం పదిలం

- డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి

నారాయణపేట టౌన్, డిసెంబర్ 14 : ప్రసవానంతరం వచ్చే మానసిక ఆరోగ్య రుగ్మతలను కౌన్సిలింగ్, ధ్యానంతో తగ్గించుకోవచ్చని డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి అన్నారు. గురువారం వైద్యారోగ్యశాఖాధికారి కార్యాలయంలో జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు ప్రసవానంతర మానసిక ఆరోగ్యంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవం అనంతరం తల్లీ, బిడ్డలకు మానసిక, శారీరక సమస్యలు ఏర్పడుతుంటాయన్నారు. గతంలో వత్తిడి, ఆందోళన ఉండడం, తగినంత నిద్రలేకపోవడం, కుటుంబ సభ్యుల సహకారం లేకపోవడం తదితర అంశాలు మానసిక ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయన్నారు. కార్యక్రమంలో పీవో ఎమ్‌హెచ్‌ఎన్ శైలజ, సైక్రియాటిస్ట్ అంబుజా, ఎంపీహెచ్‌ఈవో గోవిందరాజు, పీహెచ్‌ఎన్ సునంద, డీడీఎమ్ స్నేహ పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సౌభాగ్యలక్ష్మి

# లేఅవుట్ల అనుమతులు పారదర్శకంగా ఉండాలి


లేఅవుట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నారాయణపేట టౌన్, డిసెంబర్ 14 : అధికారులు లేఅవుట్ల అనుమతులను పారదర్శకంగా మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. గురువారం పట్టణంలోని లేఅవుట్‌లను ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా లేఅవుట్ అనుమతి కోసం వచ్చే దరఖాస్తుదారులు ఏ అధికారికి లంచం ఇవ్వకూడదన్నారు. ఒకవేళ ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వననర్సరీ పరిశీలన

పాన్‌గల్, డిసెంబర్ 14 : మండలంలోని కొత్తపేట, మాందాపూర్ గ్రామాల్లోని వననర్సరీలను ఏపీవో కుర్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన మేరకు నర్సరీల్లో మొక్కలు పెంచాలని కోరారు. గతంలో నాటిన మొక్కలు చెట్లను ఎప్పటికప్పుడు సంరక్షించాలని కోరారు.

## మొక్కలను పెంచుకుందాం

వీపనగండ్ల, డిసెంబర్ 14 : నర్సరీల్లో మొక్కలను నాణ్యవంతగా పెంచుకుందామని ఎంపీడీవో కతలప్ప అన్నారు. గురువారం తూంకుంట, సంగినేనిపల్లిలో నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

## బడీడు పిల్లలను బడిలో ఉండాలి

మాగనూరు డిసెంబర్ 14 : విద్యార్థులు చదువు మధ్యలో ఆపరాదని ఎవరైనా ఆపినట్లయితే విద్యార్థుల తల్లిదండ్రులు మళ్లీ బడిలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలని మండల నోడల్ అధికారి వెంకటయ్య అన్నారు. ఈ సందర్భంగా గరురావులింగంపల్లిలో బడిబయటి పిల్లలను ఇద్దరిని చేర్పించారు.

## 18న సర్వసభ్య సమావేశం

అమరచింత, డిసెంబర్ 14 : మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 18వ తేదిన ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మాలతి అధ్యక్షతన నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జ్యోతిఫరూసీయా తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరవుతారని తెలిపారు.

# అరుదైన వ్యాధికి చికిత్స చేసిన యశోద వైద్యులు

వనపర్తి, డిసెంబర్ 14 : జిల్లా కేంద్రానికి చెందిన యాదాచారి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ప్రాణపాయ ఉండగా యశోద వైద్యులు అతన్ని అరుదైన శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు డాక్టర్ శశికిరణ్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో యాదాచారితో కలిసి యశోద ఆసుపత్రి బృందం వివరాలను తెలిపారు. కిడ్నీ సమస్యలతో 95 శాతం ప్రాణాపాయ స్థితికి చేరుకున్న ఆయనకు బృందంతో కలిసి శస్త్రచికిత్స చేసి కాపాడమన్నారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డు ఉంటే 30 వెసులు బాటుతో పరీక్షలు చేసేందుకు వైద్యం అందించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో యశోద డైరెక్టర్ గోరుకంటి పవన్,యూనిట్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి,మార్కెటింగ్ ఇన్‌చార్జి వాసు కిరణ్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శిక్షల శాతం పెంచాలి


సీఐలతో మాట్లాడుతున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట, డిసెంబర్ 14 : ప్రతి కేసును పారదర్శకంగా విచారణ చేపట్టి శిక్షల శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో జిల్లాలోని సీఐలతో నెలవారి నేరసమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. పోలీసులు బాధ్యాతయుతంగా వ్యవహరించి బాధితులకు న్యాయం చేకూరేలా చూడాలన్నారు. న్యాయాధికారులతో సమన్వయం చేస్తూ పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులు, సమాచారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ఈనెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

## జాతీయస్థాయి ఖోఖోకు కర్ని విద్యార్థి ఎంపిక


శశిరేఖ

మక్తల్ టౌన్, డిసెంబర్ 14 : జాతీయస్థాయి ఖోఖో క్రీడలకు కర్ని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని శశిరేఖను ఎంపికైందని జీహెచ్‌ఎం రఘువీర్ రామాజీ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 18 వరకు కర్ణాటక రాష్ట్రంలో జరిగే జాతీయ క్రీడల్లో శశిరేఖ పాల్గొంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ రూపను అధ్యాపక బృందం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించినట్లు పేర్కొన్నారు.

## జాతీయ ఖోఖో సాంకేతిక అధికారిణిగా ఎంపిక


రూప

మక్తల్ టౌన్, డిసెంబర్ 14 : జాతీయస్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు రాష్ట్రం తరపున కోకో సాంకేతిక అధికారిగా కర్ని జెడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు రూప ఎంపికైనట్లు గురువారం ప్రకటనలో తెలిపారు. ఖోఖో రెఫ్రి టెస్ట్ పాసైన రూపను రాష్ట్ర కోకో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాది కృష్ణమూర్తి నియామక పత్రం అందజేశారని తెలిపారు. ఈనెల 15 నుంచి 18 వరకు కర్ణాటక రాష్ట్రంలోని తిప్పుతుర్లో నిర్వహించే పోటీలకు రూపను ఎంపిక చేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు.

## రాష్ట్రస్థాయి హాకీకి విద్యార్థిని ఎంపిక


విద్యార్థినిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

ఖిల్లాఘణపురం, డిసెంబర్ 14 : రాష్ట్రస్థాయి బాలికల హాకీ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థిని ఎంపికైనట్లు గురువారం పీఈటీ చందర్ తెలిపారు. ఈ నెల 11వ తేదీన వనపర్తిలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న నీలావతి ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అండర్–17 విభాగంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాస్థాయి బాలికల హాకీజట్టుకు ఎంపికైందని చెప్పారు. ఈ నెల 17,18,19 తేదీల్లో జిల్లా కేంద్రంలో నిర్వహించే రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్ వాణీకుమారి, సర్పంచ్ పీనానాయక్, ఉపాధ్యాయులు అభినందించారు.

## చదువుతోనే ఉజ్వల భవిష్యత్

పాన్‌గల్, డిసెంబర్ 14 : చదువుతోనే ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. మండలంలోని అన్నారం, అన్నారం తండాలో గురువారం ఆయన బడిబయటి పిల్లల ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు డ్రాప్‌అవుట్ కావడానికి గల కారణాలను విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించారు.